మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 238
పేజీలు : 5
సోమవారం 30.03.2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్
ఏజెంట్లు కావలెను
కేంద్రప్రభుత్వ డిజిటల్ మీడియా (2021) గైడ్ లైన్స్‌కి లోబడి నిర్వహణలో ఉన్న జీఎస్టీ లైసెన్స్ కలిగిన టీమీడియా (డిజిటల్) లో పని చేయడానికి మండల / నియోజక వర్గం / జిల్లా స్థాయి విలేకరులు / మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను.
అనుభవం ఉన్న వారికీ ప్రాధాన్యత, కొత్త వారికీ అవకాశం కలదు.
వివరాలకు కోసం : 8919710365, 7382990365, 8498972434 కాల్ / మెసెజ్ చేయండి.
GSTIN:36FDKPS1308P1ZX
టి-మీడియా సామాజికం ... ప్రజల పక్షం...
Spot Speed NEWS
epaper,www.tmedia.net.in YouTube facebook

అమెరికా, ఐరోపా దేశాల్లో...

# ‘నో కింగ్స్’ నిరసనలు



- ట్రంప్ నిరంకుశ విధానాలపై గళం
- ప్రముఖుల సంఘీభావం

**టీ మీడియా,మార్చి29, ఢిల్లీ బ్యూరో :** అమెరికా, ఐరోపా దేశాల్లో లక్షలాది మంది ప్రజలు నిరసనలకు దిగారు. నో కింగ్స్ ప్లకార్డులు, నినాదాలతో భారీ ర్యాలీలు నిర్వహించారు.వలసదారులపై ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ నిరంకుశ విధానాలను వ్యతిరేకిస్తూ, ఇరాన్‌పై వెంటనే యుద్ధాన్ని ఆపాలంటూ అమెరికన్లు గళమెత్తారు. మిన్నెసోటా రాష్ట్రంలోని సెయింట్ పాల్ నగరంలో ఉన్న క్యాపిటల్ లాన్ వేదికగా పెద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఇందులో ప్రముఖ అమెరికన్ గాయకుడు, గీత రచయిత, సంగీతకారుడు బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ ప్రదర్శన ఇచ్చారు.

అమెరికా కస్టమ్స్ అండ్ ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) ఏజెంట్ల దాడిలో చనిపోయిన అమెరికన్లు రెనీ గుడ్, అలెక్స్ ప్రెట్టీలను స్మరించుకుంటూ తాను రాసిన ‘స్ట్రీట్స్ ఆఫ్ మిన్నెపోలిస్’ పాటను ఆయన పాడారు. ఈసందర్భంగా బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ మాట్లాడుతూ, అమెరికాలోని వలసదారుల పరిరక్షణ కోసం ఈ ర్యాలీని నిర్వహించడాన్ని కొనియాడారు. ఐసీఈ ఏజెంట్ల పాశవిక దాడులకు వ్యతిరేకంగా ప్రజలు గళం విప్పడాన్ని ఆయన ప్రశంసించారు. ఐసీఈ ఏజెంట్ల చర్యలను మిన్నెసోటా రాష్ట్రం వ్యతిరేకిస్తుండటం, యావత్ అమెరికాకు కొత్త ఆశలను సృష్టిస్తోందని బ్రూస్ స్ప్రింగ్‌స్టీన్ వ్యాఖ్యానించారు. మిన్నెసోటా ప్రజల నిబద్ధతను చూస్తుంటే, ఇక ఐసీఈ ఏజెంట్ల అరాచకాలు సాగవని, అమెరికా నగరాలపై ఈవిధమైన దండయాత్రలకు తావు ఉండదనే నమ్మకం కలుగుతోందన్నారు.

### ప్రముఖుల సంఘీభావం

మిన్నెసోటాలోని క్యాపిటల్ లాన్‌లో జరిగిన ర్యాలీలో ఒక స్క్రీన్‌పై నటుడు రాబర్ట్ డీనిరో వీడియో సందేశాన్ని ప్లే చేశారు. తనకు ప్రతిరోజూ ఉదయాన్నే ట్రంప్ విధానాలను చూసి బాధ కలుగుతుందని, అయితే శనివారం మాత్రం లక్షలాది మంది నిరసనకారులను చూసి సంతోషం కలిగిందన్నారు. ఐసీఈ ఏజెంట్లను పట్టణం నుంచి తరిమేసినం దుకు మిన్నెసోటా ప్రజలను ఆయన అభినందిం చారు. సింగర్ జొవాన్ బాయెజ్, నటుడు జేన్ ఫోండా, వెర్మంట్‌కు చెందిన అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్, తదితర ప్రముఖులు ఈ ర్యాలీకి సంఘీభావాన్ని ప్రకటించారు.

మిగతా 4లో..





# తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో పుట్టిన టీడీపీ



- ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించిన సీఎం చంద్రబాబు

**టీ మీడియా, మార్చి 28, అమరావతి :** కార్యకర్తలను పట్టించుకోని వాళ్లు, ఇబ్బంది పెట్టే నాయకులు పార్టీకి అవసరం లేదని తెలుగుదేశం అధినేత, సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు. కష్టపడిన వాళ్లను కాపాడుకుంటూ పని చేసిన వాళ్లను గుర్తించి పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తామని స్పష్టం చేశారు. ఈ సారి 50 శాతం సీట్లు పెరగడంతో పాటు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తున్నందున రాజకీయ అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. తెలుగుదేశం పార్టీ బలంగా ఉంటేనే రాష్ట్రం బలంగా ఉంటుందని ఉద్ఘాటించారు. అమరావతి దేవతల రాజధాని కాబట్టి కొందరు రాక్షసులకు ఇష్టం లేదని జగన్‌ను ఉద్దేశించి దుయ్యబట్టారు.పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్?లో తెలుగుదేశం 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఘనంగా నిర్వహించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కేంద్రమంత్రి పెమ్మసాని, సీనియర్ నాయకులతో కలిసి పార్టీ జెండా ఎగురవేశారు. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

### తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో పుట్టిన పార్టీ టీడీపీ

కార్యకర్తలను పట్టించుకోని నేతలు తనకు అక్కర్లేదంటూ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. క్రమశిక్షణతో పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

మిగతా 4లో..

# కన్నవారికి అండగా ఉండేందుకు కొత్త చట్టం



- ‘తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత’ బిల్లుకు ఆమోదం

**టీ మీడియా ,మార్చి 29 , హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలోని వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కుటుంబ వ్యవస్థల్లో వస్తున్న మార్పుల నేపథ్యంలో పెద్దలను నిర్లక్ష్యం చేసే ఘటనలు పెరుగుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం “తల్లిదండ్రుల సంరక్షణ – ఉద్యోగుల బాధ్యత బిల్లు”ను రూపొందించింది. ఈ బిల్లును శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా ఉద్యోగులు తమ తల్లిదండ్రులను సంరక్షించకపోతే వారి వేతనం నుంచి ఒక భాగాన్ని నేరుగా తల్లిదండ్రులకు అందించే విధానం అమల్లోకి రానుంది.

### వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చింది

పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారన్న రేవంత్ రెడ్డి, పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే ఈ చట్టం తీసుకొచ్చామని అన్నారు. మన దేశంలో బాలలు, వృద్ధులు, వికలాంగుల కోసం అనేక చట్టాలు ఉన్నాయని, జువైనల్ చట్టం, విద్యాహక్కు చట్టం, పోక్సో చట్టం ఇలా ఎన్నో చట్టాలు తెచ్చామని, వృద్ధుల కోసం కేంద్రం 2007లో ఒక చట్టం తెచ్చిందని గుర్తు చేశారు. కేంద్ర చట్టం ప్రకారం తల్లిదండ్రులకు రూ. 10 వేలకు మించకుండా ఇవ్వాలని ఉందని, కేంద్ర చట్టం ప్రకారం రూ. 10 వేలకు మించి ఇచ్చే అవకాశం లేదని తెలిపారు.

### ఈ బిల్లుకు అందరూ మద్దతు ఇవ్వాలి :

సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారని, ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అత్తింటికి వెళ్లిన ఆడపిల్లలు తల్లిదండ్రుల బాగోగులు చూడలేని పరిస్థితులు ఉన్నాయని, తాము తెచ్చిన చట్టం ప్రభుత్వ ఉద్యోగులకే కాదని, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను చూసుకోలేనోడు – సమాజంలో బతకడానికి వీల్లేదని అన్నారు. సామాజిక బాధ్యతగా ఈ చట్టాన్ని తీసుకువచ్చామని, అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సీఎం ప్రసంగం అనంతరం తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

### ఉద్యోగుల వేతనంలో నెలకు 15

మిగతా 4లో..

# బీజేపీ అధికారంలోకి వస్తే అనేక కష్టాలు

- చికెన్, చేపలు, గుడ్లు కూడా ప్రజలు తినలేరు
- సీఎం మమతా బెనర్జీ



**టీ మీడియా,మార్చి29, పురూలియా :** బంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజల ఆహారపు అలవాట్లపైనా ఆంక్షలను విధిస్తుందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ ఆరోపించారు. బీజేపీ పాలనలో చేపలు, మాంసం, గుడ్లు తినే అవకాశాలనూ ప్రజలు కోల్పోతారని ఆమె వ్యాఖ్యానించారు. ఆదివారం పురూలియా జిల్లా మన్‌బజార్ పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో మమత ప్రసంగించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోని ప్రజలు చేపలను తినరని, ఒకవేళ బంగాల్‌లోనూ ఆ పార్టీ గెలిస్తే మాంసం, గుడ్లు తినడంపై ఆంక్షలను విధిస్తుందని ఆమె హెచ్చరించారు. బీజేపీ ఏకపక్షంగా వ్యవహరిస్తుందని, దానికి ఏ మతంపైనా నమ్మకం లేదని దీదీ పేర్కొన్నారు. బీజేపీ నేతలు అల్లర్లు జరిగేలా ప్రజలను రెచ్చగొడతారని, అల్లర్లతో, ప్రజలను చంపడం ద్వారా వాళ్లు అధికారంలోకి వస్తారని టీఎంసీ అధినేత్రి ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గిరిజనులు, మహిళలు, బంగాలీలపై పెద్దసంఖ్యలో దాడులు జరిగాయన్నారు. కానీ టీఎంసీ ప్రభుత్వం ఏ ఒక్క వర్గాన్నీ ఆవిధంగా అణచివేయలేదని పేర్కొన్నారు.

### నా ప్రాణాలు తీసేందుకు కుట్ర పన్నుతున్నారా : మమత


టీఎంసీ ప్రభుత్వంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్చి 28న విడుదల చేసిన ఛార్జ్‌షీట్‌పై సీఎం మమత ఘాటుగా స్పందించారు. గతంలో షా చేసిన పనులకు ఆయనపై ఛార్జ్‌షీట్‌ను నమోదు చేయాలని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021 అసెంబ్లీ ఎన్నికల టైంలో తన కాలికి అయిన గాయం గురించి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలపై దీదీ తీవ్ర అభ్యంతరాన్ని వెలిబుచ్చారు. తాను సరిగ్గా ఎన్నికల టైంలోనే బ్యాండేజీని కట్టుకొని ప్రజల్లోకి వెళ్తాను అనేలా షా మాటలు ఉన్నాయని ఆమె మండిపడ్డారు. గతంలో తాను చాలాసార్లు మరణం అంచుల వరకు వెళ్లొచ్చానని, కావాలంటే

మిగతా 4లో..

# అసోం ప్రజలకు...
# కాంగ్రెస్ ‘5 హామీలు’

### ఆదివాసీలకు శాశ్వత భూమి పట్టా

**టీ మీడియా,మార్చి29, ఢిల్లీ బ్యూరో:** అసోం ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ఆదివారం 5 హామీలు ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమం, అందరికీ ఆరోగ్య సంరక్షణ, భూ హక్కులు, జుబీన్ గార్గ్? మృతి కేసులో న్యాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అసోంలోని నౌబోయిచాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఈ 5 హామీలను ప్రకటించారు.



మిగతా 4లో..

# రెండు చోట్ల దళపతి విజయ్ పోటీ

- టీవీకే అభ్యర్థుల జాబితా విడుదల

**టీ మీడియా,మార్చి29, చెన్నై :** టీవీకే పార్టీ అధినేత విజయ్ రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం పార్టీ అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తూ, తాను రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల నుంచి విజయ్ బరిలోకి దిగనున్నారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో అభ్యర్థుల పేర్లను ప్రకటించిన విజయ్, ఈ ఎన్నికలు తమ పార్టీకి ఎంతో కీలకమని చెప్పారు.ప్రజల కోసం నిజాయితీగా పని చేసే నాయకులనే అభ్యర్థులుగా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. తమ పార్టీ గుర్తు విజిల్?కు ఓటు వేయాలని ప్రజలను కోరుతూ, ఇది ఒక కొత్త మార్పు కోసం జరిగే ఎన్నిక అని పేర్కొన్నారు. పార్టీ కీలక నేతలకు కూడా ప్రధాన స్థానాలు కేటాయించారు. టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ టి.నగర్ నుంచి పోటీ చేయనుండగా, ఆధవ్ అర్జున విల్లివాక్కం నుంచి బరిలోకి దిగనున్నారు. మాజీ మంత్రి కే.ఏ. సెంగొట్టియాన్ గోబిచెట్టిపాళ్యం నుంచి పోటీ చేయనున్నారు. పార్టీ అంతర్గత బృందానికి చెందిన మరికొందరు నేతలకు కూడా ముఖ్య నియోజకవర్గాలు అప్పగించారు.

### టీవీకే వర్సెస్ డీఎంకే



ఈ సందర్భంగా అధికార డీఎంకే కూటమిపై విజయ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆ కూటమి సహజమైనది కాదని, కేవలం ప్రయోజనాల కోసం ఏర్పడిన ప్యాచ్ అప్ అలయన్స్ అని వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల పోరు తమ ప్రజల కూటమి టీవీకే, స్టాలిన్ నేతృత్వంలోని కూటమి మధ్యనే జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చే హామీల విషయానికి వస్తే, యువతకు ప్రాధాన్యం ఇస్తూ పలు కీలక నిర్ణయాలు ప్రకటించారు. ఇంటర్మీడియట్ నుంచి పీహెచ్‌డీ వరకు చదువుకునే విద్యార్థులకు ఎటువంటి పూచీకత్తు లేకుండా రూ. 20 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు.అలాగే డిప్లొమా పూర్తి చేసిన వారికి నెలకు రూ. 2,000, గ్రాడ్యుయేట్లకు రూ. 4,000 ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. మహిళల భద్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తామని విజయ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో కఠిన చట్టాలు అమలు చేసి, శాంతి భద్రతలను బలోపేతం చేస్తామని తెలిపారు. ముఖ్యంగా, తమిళనాడును మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా మార్చేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పరీక్షలను సమయానికి నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని కూడా చెప్పారు.

### అసెంబ్లీని కాపాడే బాధ్యత వారి మీదనే!

తమ పార్టీ అభ్యర్థులపై ప్రత్యేకంగా మాట్లాడిన విజయ్, వారు సంపన్నులు కాదని, సాధారణ ప్రజల కష్టాలను అర్థం చేసుకునే వ్యక్తులని అన్నారు. “ఎమ్మెల్యే అనేది కేవలం పదవి కాదు. అది ప్రజల గొంతుక. అసెంబ్లీని కాపాడే బాధ్యత వారి మీద ఉంటుంది” అని పేర్కొన్నారు. అనుభవం కంటే నిజాయితీ, బాధ్యత, ప్రజల పట్ల నిబద్ధత ముఖ్యమని చెప్పారు. పెరంబూర్‌లో డీఎంకే అభ్యర్థి ఆర్.డి. శేఖర్‌తో, తిరుచ్చి ఈస్ట్‌లో ఇనిగో ఇరుదయరాజ్‌తో విజయ్ పోటీ చేయనున్నారు.దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో పోటీ ఆసక్తికరంగా మారింది. అలాగే కొలత్తూర్‌లో టీవీకే అభ్యర్థి వీఎస్ బాబు నేరుగా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఎదురు నిలవనున్నారు. చెపాక్‌లో ఉదయనిధి స్టాలిన్‌కు వ్యతిరేకంగా కూడా టీవీకే అభ్యర్థి పోటీ చేయనున్నారు. ఈ ఎన్నికల ద్వారా రాజకీయ రంగంలోకి అడుగుపెడుతున్న విజయ్, ప్రజలకు ఒక అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయబోమని, అవినీతి చేయబోమని హామీ ఇచ్చారు. “మేము ప్రజల కోసమే ఉన్నాం ఎప్పుడూ ప్రజల కోసమే ఉంటాం” అని స్పష్టం చేశారు. తమిళనాడులో మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటించనున్నారు. ప్రస్తుతం రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం మే 10తో ముగియనుంది.

# అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్

- తీర్మానం ప్రవేశపెట్టిన

మంత్రి శ్రీధర్‌బాబు - ఆమోదించిన స్పీకర్

**టీ మీడియా ,మార్చి 29 , హైదరాబాద్ బ్యూరో:**

తెలంగాణలో మైనింగ్ అక్రమాలపై హౌసింగ్ కమిటీ వేయాలంటూ శాసనసభలో ఆందోళనకు దిగిన బీఆర్?ఎస్ సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు శాసనసభ వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు ప్రతిపాదించగా సభ్యుల అంగీకారంతో తీర్మానాన్ని ఆమోదించారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు రెండు రోజులపాటు అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను సస్పెండ్ చేశారు.

**సస్పెండ్ అయిన ఎమ్మెల్యేలు**

దీంతో బీఆర్?ఎస్? ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని, జగదీశ్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, గంగుల కమలాకర్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు, పద్మారావు, చింతా ప్రభాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, మర్రి రాజశేఖరరెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, సబితాఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేశ్, విజయుడు, కె.పి.వివేకానంద్, అనిల్‌జాదవ్, కోవ లక్ష్మిలపై సస్పెన్షన్ వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

**బెదిరించే ధోరణిలో కౌశిక్‌రెడ్డి ప్రవర్తన :**

అదే విధంగా సీనియర్ శాసనసభ్యుడు, మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని బెదిరించే ధోరణిలో అసభ్యంగా సైగలు చేశారంటూ హుజూరాబాద్ శాసనసభ్యుడు పాడి కౌశిక్‌రెడ్డిపైనా చర్యలకు తీర్మానించారు. కౌశిక్‌రెడ్డి వ్యవహారాన్ని విచారణ చేయాలని నైతిక కమిటీకి సిఫారసు చేశారు.

**ఆయన ప్రవర్తనను కేటీఆర్?, హరీశ్? సమర్థిస్తారా?**



ప్రజాజీవితంలో నుంచి వచ్చిన కడియం శ్రీహరి కేసీఆర్‌కు సరిసమానమైన ప్రజాప్రతినిధి అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కడియం శ్రీహరి నిజాయితీ, నిబద్ధతను ఈ దేశంలోనే ఎవరూ ప్రశ్నించలేరని తెలిపారు. ఆయన పట్ల కౌశిక్‌రెడ్డి ప్రవర్తనను కేటీఆర్, హరీశ్‌రావు సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. ఈ విధానాన్ని ఇక్కడే నిలువరించాలని అభిప్రాయపడ్డారు. కౌశిక్‌రెడ్డి ప్రవర్తనను ఇప్పుడు సభ క్షమిస్తే భవిష్యత్‌లో సభలో కత్తిపోట్లు, కుస్తీలపోటి జరగాల్సిన పరిస్థితి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యులు చర్చలో పాల్గొని సహకరిస్తే వారిని సభలో కొనసాగించండి లేదంటే, సభ వ్యవహారాలు నిర్వహించుకునేందుకు వీలుగా వారిని సభ నుంచి రెండురోజులు సస్పెండ్ చేయండి అని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పాలనలో దొరలకే పాలన పగ్గాలు కట్టబెట్టారన్న సీఎం రేవంత్ రెడ్డి బీఆర్?ఎస్? పార్టీ ఎమ్మెల్యేలు దళిత వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నారని మండిపడ్డారు. దళితుడు ఆర్థిక మంత్రి, ఉపముఖ్యమంత్రిగా ఉండవద్దని వారి ఆలోచన ఉందన్న ఆయన రాజ్యాలు ఏలడం వారి హక్కు అంట చేపలు, గొర్రెలు పెంచడం మా హక్కు అనే విధంగా వారు ప్రవర్తిస్తున్నారని అన్నారు. పార్టీ ఫిరాయింపులపై నినాదాలు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు.

**ఆధారాలుంటే సీబీసీఐడీకి ఇవ్వండి**

వివక్షతో కులాన్ని అవమానిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీలో గెలిచిన వారిని బీఆర్?ఎస్ మంత్రులను చేసిందని గుర్తుచేశారు. పార్టీ ఫిరాయించినవారు, ఇవాళ నినాదాలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుని మంత్రులను చేశారన్నారు. పార్టీ ఫిరాయించిన వారే మంత్రి సీతక్కను విమర్శిస్తున్నారని మండిపడ్డారు. దుష్టసంప్రదాయానికి పునాది వేసిందే బీఆర్ఎస్? పార్టీ అని జాతిపితలమని వారికి వారే సర్టిఫికెట్లు ఇచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డినా, తన కుటుంబసభ్యులైన అక్రమాలకు పాల్పడినట్లు ఆధారాలు ఉంటే సీబీసీఐడీ ముందుపెట్టండని సవాల్? విసిరారు.

**ఏ పార్టీ వారో చెప్పాలని అడిగారు**

కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందని బీఆర్?ఎస్? పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్? యాదవ్ అన్నారు. పొంగులేటి అంశంపై సభాసంఘం వేయాలని తాము డిమాండ్ చేస్తే ఆ అంశాన్ని వదిలేసి సీఎం కులాల ప్రస్తావన తీసుకువచ్చారని తెలిపారు. కడియం, దానం ఏ పార్టీ సభ్యులని వారికి మాట్లాడే అవకాశం ఇచ్చారని ప్రశ్నించారు. వారు ఏ పార్టీ వాళ్లో చెప్పాలని మాత్రమే కౌశిక్‌రెడ్డి అడిగారని అన్నారు. ఈ ప్రభుత్వంలో అసెంబ్లీలో ఏ కమిటీలు లేవని పేర్కొన్నారు.



## తెలుగుదేశం పార్టీ 44 వ ఆవిర్భావ దినోత్సవము

**టీ.మీడియా,మార్చి29,చింతూరు:**

తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం అంగరంగ వైభవంగ జరిగింది. తొలుత మండల అధ్యక్షులు మొహమ్మద్ జమాల్ఖాన్ పార్టీ జండాను ఆవిష్కరించారు. అనంతరం స్వర్గీయ నంద మూరీ తారక రామారావు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి ఎన్టీఆర్ అమర్రహే అని నినాదాలు చేశారు. భారీ కేక్ కట్చేసి ఒకరినొకరు తినిపించుకొని ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు జమాల్ ఖాన్ మాట్లాడుతూ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీనీ 1982 సంవత్సరం లో స్థాపించి 9 నెలల కాలం లోనే పార్టీ అత్యధిక మెజార్టీ తో ఆంధ్రప్రదేశ్లో విజయ దుందుభి మోగించిందని అన్నారు. రెండు రూపాయల కిలో బియ్యం ఆనాడు ఎంతో దూర దృష్టి తో పేదల ఆకలి బాధలు తీర్చే పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఎన్టీఆర్ దేనని అన్నారు. ఆయన చూపిన బాటలోనే అందరూ నడవాలని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త నడుంబిగించాలని ఈ సందర్భంగా పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు ఎండి జహంగీర్,ఓబులనేని రామారావు చౌదరి,ఇళ్ల చిన్నారెడ్డి,ఆసిఫ్, ప్రధానకార్యదర్శి మల్లెల్లి వెంకటేశ్వరరావు. మహిళ అధ్యక్షురాలు మంగవేణి, సీనియర్ నాయకులు ఆకోజు నూకాచారి, క్లస్టర్ ఇంచార్జ్ ఓ నరసింహారావు, పొదిలి రామారావు, ముత్యాల శ్రీరామ్,ఎస్టీ సెల్ అధ్యక్షులు తుర్రం ముత్తయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడు పి. సాల్మన్ రాజు, మాజీ సర్పంచ్ సోడే. శ్రీనివాసరావు, ఎండి రియాజ్ ,కట్ట శంకర్ , జాఫర్ ,బిజెపి నాయకులు బట్ట లక్ష్మణ్,సుప్రజ,

## గుడికి సౌండ్ సిస్టమ్ అందజేసిన కౌన్సిలర్

**టీ మీడియా, మార్చి 28, పెబ్బేరు:**



పెబ్బేరు పట్టణంలోని 12వ వార్డులో గల చౌడేశ్వరి దేవి ఆలయానికి స్థానిక బీఆర్ఎస్ కౌన్సిలర్ సౌజన్య దిలీప్ కుమార్ రెడ్డి సౌండ్ సిస్టమ్‌ను అందజేశారు. సుమారు ఒక లక్ష రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ సౌండ్ సిస్టమ్‌ను ఆలయ పూజారి మరియు ఆలయ కమిటీ సభ్యులకు ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కౌన్సిలర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఆలయ కార్యక్రమాలు మరింత సౌకర్యవంతంగా నిర్వహించడానికి ఈ సౌండ్ సిస్టమ్ ఉపయోగపడుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌడేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు, రెడ్డి సేవా సమితి ప్రతినిధులు, గ్రామ ప్రజలు మరియు యువకులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి అండగా మున్సిపల్ వైస్ చైర్మన్

**టీ మీడియా, మార్చి 28, పెబ్బేరు:**



పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డుకు చెందిన దకలి బాలమ్మ అనారోగ్యంతో కొంతకాలంగా బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాలమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆమె, కుటుంబానికి రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిరణ్, భగవంతు, మాలిక్, వినోద్, ప్రఫుల్ తదితరులు పాల్గొన్నారు.



## మార్షల్ ఆర్ట్స్‌తోనే మహిళా రక్షణ సాధ్యం

- కుంగ్ పూ బెల్టుల ప్రధానోత్సవం


**టిమీడియా,మార్చి,29,ఎండపల్లి:**

మారుతున్న కాలంలో ఆత్మరక్షణ అనేది ప్రతి ఒక్కరికీ అనివార్యమని,కుంగ్-పూ వంటి యుద్ధ విద్యలు శారీరక దృఢత్వానికే కాక మానసిక వికాసానికి తోడ్పడతాయని డ్రాగన్ స్వార్డ్ కుంగ్-పూ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.రాజమల్లు (నింజా) స్పష్టం చేశారు. ఆదివారం జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లిలోని అక్షర పాఠశాలలో డ్రాగన్ స్వార్డ్ కుంగ్-పూ అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్టుల ప్రధానోత్సవ కార్యక్రమం అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. శిక్షణ పొందిన విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు ఆహూతులను మంత్రముగ్ధులను చేశాయి. గాలిలో ఎగురుతూ చేసిన కిక్కులు,ఆత్మరక్షణ మెళకువలు చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన 100 మంది విద్యార్థులకు గ్రాండ్ మాస్టర్ రాజమల్లు చేతుల మీదుగా వివిధ స్థాయిల బెల్టులు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ రాజమల్లు మాట్లాడుతూ.. "నేటి సమాజంలో బాలికలు, మహిళలు తమను తాము రక్షించుకోవడానికి మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరం. ఇది కేవలం ఆట మాత్రమే కాదు, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం" అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీస్తున్న శిక్షకులను ఆయన ఈసందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అక్షర పాఠశాల కరస్పాండెంట్ ఆశీరెడ్డి, ప్రిన్సిపాల్ అనంత రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఇటువంటి క్రీడల్లో ప్రోత్సాహం అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అకాడమీ ప్రెసిడెంట్ రాజేందర్, జనరల్ సెక్రటరీ కస్తూరి ప్రవీణ్, ఇన్‌స్ట్రక్టర్లు లింగంపల్లి రమేష్, శ్రీకాం.

## తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదేశం

**టీ మీడియా, మార్చి 29, కొణిజర్ల :**



కొణిజర్ల మండల కేంద్రంలో మార్క్‌ఫెడ్ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌ను కోరుతూ కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు మెమోరాండం సమర్పించారు. ప్రాంతీయ రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, వారి పంటకు మద్దతు ధర లభించేలా మండల కేంద్రంలోనే కొనుగోలు కేంద్రం ఉండాలని ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్, కొణిజర్ల లో తక్షణమే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతుల సమస్యను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు సూరంపల్లి రామారావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ నిర్ణయంతో స్థానిక మొక్కజొన్న రైతులకు రవాణా భారంతో పాటు దళారుల బెడద తప్పుతుందని హర్షం వ్యక్తం చేశారు.

## నూతన పదవులు చేపట్టిన నాయకులకు సన్మానం

**టీ మీడియా ,మార్చి 29 ,పెబ్బేరు:**



ఆదివారం నూతనంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసి సి లో నూతన పదవులు పొందిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు పెబ్బేరు మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశానికి విచ్చేసిన సందర్భంగా టి సాయిచరణ్ రెడ్డి డి సి సి ఉపాధ్యక్షులు పి బ్రహ్మాశీ చారి డి సి సి ప్రధాన కార్యదర్శి మధుసూదన్ గౌడ్ మున్సిపల్ వైస్ చైర్మన్ వనపర్తి గా పేర్కొన్నారు వారిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మార్కెట్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి వార్డు కౌన్సిలర్లు పర్వీన్ షకీల్ తాటి కొండ క్రిష్ణ సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి రంజిత్ కుమార్ రజక నరసింహ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిమానులు శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియచేసారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## స్కూల్ యాజమాన్యానికి కొమ్ము కాస్తున్న ఎమ్మెల్యే?

- మైనార్టీలకు భద్రత కరువు: ఇంతియాజ్ ఇసాక్

**టీ మీడియా, మార్చి 29, వనపర్తి బ్యూరో:**



వనపర్తి జిల్లా కేంద్రంలోని అక్షర కాన్సెప్ట్ స్కూల్‌లో జరిగిన ఘటన సమాజానికి తలవంపుగా నిలిచిందని రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్ తీవ్రంగా విమర్శించారు. ఈ ఘటనపై జిల్లా మంత్రి ఇప్పటి వరకు స్పందించకపోవడం శోచనీయమని ఆయన అన్నారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడిన ఆయన, "మైనార్టీ బాలికపై జరిగిన దారుణ ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. నిందితుడిని అరెస్ట్ చేయడం స్వాగతించదగ్గ విషయమే అయినా, అది న్యాయం కాదని, కేవలం మొదటి అడుగే" అని పేర్కొన్నారు. ఈ ఘటనపై పలు ప్రశ్నలు ఇంకా సమాధానం లేకుండా ఉన్నాయని ఆయన అన్నారు. ఘటనను దాచిపెట్టడానికి ప్రయత్నించినవారు ఎవరు?స్కూల్ యాజమాన్యం బాధిత కుటుంబాన్ని సంప్రదించి సెటిల్‌మెంట్‌కు ఎందుకు ప్రయత్నించింది?వెంటనే పోలీసులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు?స్కూల్ యాజమాన్యంపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, నేరాన్ని దాచిపెట్టడం కూడా నేరమేనని ఆయన స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం కోరుతున్న నాయకులపై అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమని, ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పోలీసులు చట్టం కోసం పనిచేయాలని, అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించవద్దని హెచ్చరించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుని, బెయిల్ రాకుండా చూడాలని, 90 రోజుల్లో ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు.

**అదేవిధంగా:**

అక్షర కాన్సెప్ట్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలి

స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి

నాయకులపై నమోదైన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలి

బాధిత కుటుంబానికి పూర్తి సహాయం అందించాలిఇవి డిమాండ్లు మాత్రమే కాకుండా ప్రజల హక్కులని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మైనార్టీ అధ్యక్షుడు జోహెబ్ హుస్సేన్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధి కనపర్చాలి

- అండర్ టన్నెల్ పనులు ప్రారంభించాలి
- ప్రాజెక్టు పూర్తికి ముగ్గురు మంత్రులు బాధ్యత తీసుకోవాలి
- సీతారామ ప్రాజెక్టు పనులను పరిశీలించిన రైతు సంఘం


**టీ మీడియా,మార్చి29,సింగరేణి(కారేపల్లి):**



ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు పూర్తికి ప్రభుత్వం చిత్తశుద్ధితో నిధులు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి చీమలపాడు వద్ద అండర్ టన్నెల్ నిర్మాణం చేసే గుట్టల ప్రాంతాన్ని ఆదివారం తెలంగాణ రైతు సంఘం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ గోదావరి జలాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా కు అందాలని మాజీ పార్లమెంట్ సభ్యులు తమ్మినేని వీరభద్రం 100 రోజుల మహాప్రస్థానం గోదావరి జలాల సాధన పాదయాత్రతో దుమ్ముగూడెం ప్రాజెక్టు వెలుగులోకి వచ్చిందన్నారు. సీతారామ ప్రాజెక్టు గా పేరుమారిన ఈ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లా లో కామేపల్లి,కారేపల్లి, రఘునాధపాలెం,ఖమ్మం రూరల్, తిరుమలాయపాలెం, కుసుమంచి మండలాల్లో భూములకు సాగునీరు అందించటం తో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టు రెండున్నర లక్షల ఎకరాలకు సాగునీరు అందించనుందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం పాపకొల్లు గుట్టల వరకు ప్రధాన కాలువలు పూర్తి అయ్యాయని, ఖమ్మంజిల్లాలో తిరుమలాయపాలెం మండలం సుబ్లేడు వద్ద పనులు జరిగాయని తెలిపారు. సీతారామ ప్రాజెక్టు ప్రధాన పనులు లో కారేపల్లి మండలం చీమలపాడు, జూలూరుపాడు మండలం పాపకొల్లు గుంటల్లో 2 కిలోమీటర్ల అండర్ టన్నెల్ నిర్మాణం పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం దీర్ఘ కాలం పట్టే పనులు ప్రారంభం చేయకుండా కేవలం మట్టి కాలువలు, త్రవ్వకం చేయడం ఆశ్చర్య పరుస్తుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా లో 7 లక్షల ఎకరాల భూములకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయుటకు అవసరమైన నిధులు బడ్జెట్లో కేటాయింపులు చేయకుండా కేవలం రూ.336 కోట్లు మాత్రమే కేటాయించారని, బడ్జెట్ ప్రతిపాదనలు సవరించి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా లోని ముగ్గురు మంత్రులు సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి గోదావరి జలాల అందించేందుకు భాధ్యత వహించాలన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండెబోయిన నాగేశ్వరరావు లు మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం భూ సేకరణ లో నిర్వాసిత రైతులకు వేరు వేరు భూమి ధరలు నిర్ణయించి పరిహారం అందించడం సరికాదన్నారు. భూములు కోల్పోయిన రైతులందరికి ఎకరాకు రూ.25 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పూర్తి అయ్యే వరకు సేకరించిన భూమిలోని పంట ఫలసాయం రైతులకే చెందాలని దీనిపై మంత్రులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి వజ్జా రామారావు, నాయకులు మద్దెల నాగయ్య, ఎర్రిపోతు భద్రయ్య, సూరపాక ధనమ్మ, దారవత్ వినోద్, మాడపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్లకు కంటి చూపు పరీక్షలు: సిఐ సంజీవ్

**టీ మీడియా ,మార్చి 29 , కూసుమంచి:**




డ్రైవింగ్ వృత్తిలో కంటి చూపు చాలా కీలకమైనదని, కంటి చూపు బాగుంటేనే వాహనాన్ని సమర్థవంతంగా నడపగలుగుతారని కూసుమంచి సిఐ సంజీవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా కొనసాగుతున్న అరైవ్ అలైవ్ మూడోవ విడత అవగాహన కార్యక్రమంలో భాగంగా.. రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి పర్యవేక్షణలో కూసుమంచి హైవే లో వెళ్తున్న భారీ వాహనాల డ్రైవర్లకు రహదారి భద్రతపై అవగాహన కల్పించడంతో పాటు శివ అప్టికల్స్ సహకారంతో కూసుమంచి ప్రభుత్వ పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో, లారీ, ట్రాక్టర్, కారు డ్రైవర్లకు రోడ్డు భద్రతలో పాటించాల్సిన నియమాలపై సమగ్రంగా వివరించారు. ఈ శిబిరం ద్వారా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు ఇచ్చారు. వయస్సు పెరిగే కొద్ది కంటి చూపు మందగించడం సహజమని, క్రమం తప్పకుండా కంటి వైద్య పరీక్షలు నిర్వహించుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కంటి చూపు స్పష్టంగా ఉంటే ట్రాఫిక్ సిగ్నల్స్, రహదారి సూచనలు సరిగ్గా గుర్తించి సురక్షితంగా వాహనాలు నడపగలరని తెలిపారు. చాలా మంది డ్రైవర్లు కంటి చూపును అశ్రద్ధ చేస్తున్నారనే ఉద్దేశంతో కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూసుమంచి ఎస్సై నాగరాజు పాల్గొన్నారు.

## వాహదారులు రక్షణాత్మక డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలి

- ఎస్సై బైరు.గోపి

**టీ మీడియా,మార్చి29, సింగరేణి (కారేపల్లి ):**




వాహనదారులు రక్షణాత్మక డ్రైవింగ్ పై దృష్టి పెట్టాలని కారేపల్లి ఎస్సై బైరు గోపి అన్నారు. ఆదివారం అరైవ్ ఆలైవ్ కార్యక్రమంలో భాగంగా కారేపల్లి క్రాస్ రోడ్డులో ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు కీలక సూచనలు చేశారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయడం ప్రమాదకరమని, అతివేగం ప్రాణాంతకమని హెచ్చరించారు. మైనర్ల డ్రైవింగ్ నిషేధమని, మైనర్ల కు వాహనాలు ఇవ్వవద్దని తల్లిదండ్రులను కోరారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. రోడ్డుపై వెళ్లేటప్పుడు మీ కోసం ఇంట్లో ఎదురుచూసే భార్యాపిల్లలను గుర్తుకు తెచ్చుకోవాలని సూచించారు.




## అలరించిన చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం

**టీ మీడియా, మార్చి 29, మధిర:**



శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మధిర మున్సిపాలిటీ పరిధిలోని జిలుగుమాడు లో శ్రీ హనుమాన్ కోదండ రామాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీరాముల వారి పట్టాభిషేకము మరియు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణాన్ని వేద పండితులు అనంత ఆచార్యులు గారి చేతుల మీదుగా అంగరంగ వైభవంగా నిర్వహించగా అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టాభిషేకం కార్యక్రమం సందర్భంగా కొతారి శ్రీను బాబు సహకారంతో లిడాన్స్ మాస్టర్ నాగరాజు ఆధ్వర్యంలో కళాసాధన నృత్య కళానికేతన్ చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన కార్యక్రమం చూపరులను ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో చిన్నారులు వెంకటేశ్వర స్వామి, శ్రీరాముడు,శివపార్వతుల గెటప్పులతో వేసిన ప్రత్యేక నృత్యాలు భక్తులకు కట్టిపడేశాయి. అనంతరం నృత్య చిన్నారులకు జిలుగుమాడు సభ్యులు గ్రామ పెద్దలు కొటారి రాఘవ గారు మరియు శ్రీ హనుమాన్ కోదండరామ దేవాలయ కమిటీ వారు,మధిర ప్రెస్ క్లబ్ సభ్యుల చేతుల మీదుగా కళాకారులకు బహుమతులు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షులు పుతుంబాక కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## సమాజాన్ని చైతన్యం చేయగలిగేదే ఉపాధ్యాయుల ఉద్యోగం

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి

**టీ మీడియా, మార్చి 29, వనపర్తి బ్యూరో :**

పెద్దమందడి మండలం మోజర్ల మద్దిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉద్యోగం చేస్తూ పదవి విరమణ పొందిన ధనరాజ్ రానదేవ్ ను వనపర్తి పట్టణ కేంద్రంలో గల ఆర్ జీ గార్డెన్ లో ఏర్పాటు చేసిన పదవి విరమణ సన్మాన సభ లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి సన్మానించడం జరిగింది. చిన్నారెడ్డి మాట్లాడుతూ 36 సంవత్సరాలు ఉపాధ్యాయ విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసి గోపాల్ పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధనరాజ్ రానదేవ్ పదవి విరమణ చేయడం గొప్ప విషయం అన్నారు. సమాజాన్ని చైతన్యం చేయగలిగే ఒకే ఒక ఉద్యోగం ఉపాధ్యాయ ఉద్యోగమని అన్నారు. ధనరాజ్ రానదేవ్ విద్యాబోధనలో అశేష ప్రతిభతో బోధించి ఎందరో విద్యార్థులకు బంగారు భవిష్యత్తులకు బాటలు వేశారని అన్నారు. ఉపాధ్యాయ వృత్తిలో ధనరాజ్ రానదేవ్ క్రమశిక్షణతో స్నేహ పూర్వకంగా మెదిలి అందరి మన్ననలను పొందారని అన్నారు. పదవి విరమణ అనేది అనివార్యమని ప్రతి ఒక్కరు పదవి విరమణ పొందవలసి వస్తుందని అన్నారు. ధనరాజ్ రానాదేవ్ భావి జీవితం సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కోర్టు ప్లీడర్ కిరణ్ కుమార్, వనపర్తి మండల్ కిసాన్ సెల్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, సీనియర్ నాయకులు అబ్దుల్లా, నందిమల్ల రామ్, ద్వారాపోగు విజయ్

# పెళ్లిళ్లకు రెండు సిలిండర్లే

• ఆందోళనలో వినియోగదారులు

**టీ మీడియా,మార్చి29, ఢిల్లీ బ్యూరో :**

దేశంలో ప్రస్తుతం పెట్రోలు, డీజిల్, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని కేంద్ర ప్రభుత్వం ఓవైపు స్పష్టం చేస్తుండగా, మరోవైపు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాయి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు. ఈ నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగం, అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది.



**సరఫరాలో అంతరాయం కలగవచ్చని ఆందోళన**

రాష్ట్రంలో ఒకే కుటుంబానికి సంబంధించిన పేర్లపై రెండు కంటే ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించిన సందర్భాలు పెరిగినట్లు అధికారులు తెలిపారు. ఆ కనెక్షన్లను గృహ అవసరాలకు కాకుండా వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారని వెల్లడించారు. దీని వల్ల నిజంగా అవసరమున్న వినియోగదారులకు సరఫరాలో అంతరాయం కలగవచ్చని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**వారిపై కఠిన చర్యలు**

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఒక కుటుంబంలో రెండు కంటే ఎక్కువ గ్యాస్ కనెక్షన్లు ఉన్నట్లు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. ఆ చర్యల ద్వారా గ్యాస్ సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని, అవసరమైన వారికి సమయానికి సిలిండర్లు అందుతాయని అధికారులు భావిస్తున్నారు. ఆహార సరఫరా శాఖ కార్యదర్శి ఆనంద్ స్వరూప్ మాట్లాడుతూ, "గ్యాస్ సరఫరా వ్యవస్థను సమతుల్యం చేయడం మా ప్రధాన లక్ష్యం. దుర్వినియోగం, అక్రమ వినియోగాన్ని అరికట్టడం ద్వారా నిజమైన వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుంది" అని తెలిపారు.

**ఎంత మంది ఉన్నా రెండు సిలిండర్లే!**

ఇక పెళ్లిళ్లు, ఇతర పెద్ద కార్యక్రమాల విషయంలో కూడా ప్రభుత్వం కొత్త నిబంధనలు అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నిర్ణయం ప్రస్తుతం విస్తృత చర్చకు దారితీస్తోంది. తాజా ఆదేశాల ప్రకారం, పెళ్లి వంటి పెద్ద ఈవెంట్లు నిర్వహించే కుటుంబాలకు కేవలం రెండు గ్యాస్ సిలిండర్లు అందజేస్తారు. అతిథుల సంఖ్య ఎంత ఉన్నా, వంట ఏర్పాట్లు రెండు సిలిండర్లతోనే చేయాల్సి ఉంటుంది. అధికారుల ప్రకారం, ఆ నిర్ణయం వనరుల సమతుల్య వినియోగాన్ని నిర్ధరించేందుకు తీసుకున్నారు. అధిక వినియోగాన్ని నియంత్రించడం ద్వారా గ్యాస్ సరఫరాలో అసమతుల్యత రాకుండా చూడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పెళ్లి వంటి కార్యక్రమాలకు అవసరమైన ఈ రెండు సిలిండర్లను గ్యాస్ ఏజెన్సీల నుంచి తాత్కాలిక కనెక్షన్ ద్వారా పొందవచ్చని అధికారులు తెలిపారు.

ఇక గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగంపై కూడా ప్రభుత్వం గట్టిగా నిఘా పెట్టింది. గృహ వినియోగ సిలిండర్లను హోటళ్లు, ధాబాలు, ఇతర వ్యాపార సంస్థల్లో ఉపయోగిస్తున్నట్లు గుర్తించిన కేసులు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఇది నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై లైసెన్సు రద్దు, జరిమానాలు, అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రజలను కూడా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా గ్యాస్ సిలిండర్ల దుర్వినియోగం చేస్తున్నట్లు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

**రెండు సిలిండర్లతో వంట చేయడం కష్టం!**

అదే సమయంలో కొత్త నిర్ణయాలపై ప్రజల్లో మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొంతమంది ప్రభుత్వ చర్యలను సమర్థిస్తున్నారు. గ్యాస్ వృథాను తగ్గించడంలో ఇవి ఉపయోగపడతాయని, నిజమైన అవసరమున్న వారికి లబ్ధి చేకూరుతుందని అభిప్రాయపడుతున్నారు. అయితే మరికొందరు ఆ నియమాలు ప్రాక్టికల్?గా వర్కౌట్ కావని అంటున్నారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సమయంలో వందల సంఖ్యలో అతిథులు హాజరవుతారని, అలాంటి సందర్భాల్లో కేవలం రెండు సిలిండర్లతో వంట చేయడం కష్టమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధన వల్ల కార్యక్రమాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తే అవకాశముందని పేర్కొంటున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం తీసుకున్న ఉత్తరాఖండ్ ప్రభుత్వం నిర్ణయాలు ఎంతవరకు ఫలితాన్నిస్తాయో చూడాలి.

## జర్నలిస్టుల రక్షణకై అహర్నిశలు కృషి చేస్తా

• జిల్లా అధ్యక్షుడు మోకనపల్లి బద్రి

**టి మీడియా, మార్చి 29, మంచిర్యాల్:**



మంచిర్యాల జిల్లా లోని కిడ్స్ ప్లే స్కూల్ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన జె ఎస్ ఎస్ జిల్లా స్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహణ అదేవిధంగా జిల్లా కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి విచ్చేసిన జర్నలిస్టు మిత్రులు పాల్గొని మోకనపల్లి బద్రిని మంచిర్యాల జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా డి. వెంకటేష్, జిల్లా జనరల్ సెక్రెటరీ గా మారేపల్లి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గా సిరిపురం మధు, జిల్లా ఉపాధ్యక్షులుగా రాజయ్య, శనిగారపు వెంకటేష్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా స్వామి, అదేవిధంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా కుషనపల్లి సతీష్ మాదాసు శ్రీకాంత్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ నా మీద నమ్మకాన్ని ఉంచి జిల్లా అధ్యక్ష పదవి బహుకరించిన జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న జేఎస్ఎస్ జర్నలిస్టు సంక్షేమ సంఘం సభ్యుల హక్కుల కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ఈ సమావేశంలో మాసాని రమేష్, సిరిపురం మధు, సతీష్, ఠాగూర్ సుశీల్, శేఖర్, ఆంజనేయులు, శ్రీ కాంత్ యాదవ్, మోరే రవీందర్, శనిగారపు వెంకటేష్, జైపూర్ గంగాధరి రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నంది మేడారం పీహెచ్‌సీలో స్పెషలిస్ట్ చే వైద్య శిబిరం

• అర్హులైన బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ పంపిణీ

**టిమీడియా,మార్చి28,ధర్మారం:**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన '99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా ధర్మారం మండల పరిధిలోని ప్రజల కోసం సోమవారం మార్చి 30 వ తేదీన నంది మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో భారీ స్పెషలిస్ట్ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు డాక్టర్ అనుదీప్, డాక్టర్ సుస్మిత తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఈ వైద్య శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు ఉచితంగా పరీక్షలు చేసి, చికిత్స అందిస్తారు అని ఈ వైద్య శిబిరానికి నిపుణులైన వైద్యులు, జనరల్ మెడిసిన్, ఎముకల వ్యాధుల నిపుణులు (ఆర్థోపెడిక్), స్త్రీ ప్రసూతి వ్యాధుల నిపుణులు (గైనకాలజీ), చిన్నారుల వైద్య నిపుణులు (పీడియాట్రిషన్), దంత వైద్య నిపుణులు (డెంటల్), కంటి వైద్య నిపుణులు (ఆప్తాల్మాలజీ)వైద్య పరీక్షలు చేయించుకోదలిచిన వారు తమ వెంట ఆధార్ కార్డు తో పాటు గతంలో చేయించుకున్న మెడికల్ రిపోర్టులను తీసుకురావాలని అధికారులు సూచించారు.

బాలికలకు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక టీకా

అదే రోజున క్యాన్సర్ నివారణ దిశగా ప్రభుత్వం మరో కీలక అడుగు వేయనుంది అని. 14 ఏళ్లు నిండి, 15 ఏళ్లు పూర్తి కాని బాలికలకు (14వ పుట్టినరోజు పూర్తి చేసుకున్న వారు) గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ రాకుండా నిరోధించే హెచ్‌పివి – హ్యూమన్ పపిల్లోమా వైరస్ వ్యాక్సిన్ ఇచ్చే కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనుందని. అర్హులైన బాలికలను వారి తల్లిదండ్రులు ఆధార్ కార్డుతో సహా తీసుకువచ్చి ఈ టీకా వేయించుకోవాలని. మండలంలోని ప్రజలు, రోగులు, ప్రజా ప్రతినిధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు.

## ఎర్రబోడులో విద్యుత్ తీగల చోరీ

**టీ మీడియా,మార్చి29,సింగరేణి(కారేపల్లి):**



సింగరేణి మండలం ఎర్రబోడు గ్రామంలో కరెంట్ స్తంబాలకు ఉన్న విద్యుత్ వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్ళారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ పరిసరాల్లో వ్యవసాయ భూములకు వెళ్ళ సుమారు పది కరెంటు స్తంభాలకు సంబంధించిన విద్యుత్ తీగలను కత్తిరించి దొంగిలించారు. ఈ ఘటనతో గ్రామంలోని రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆదివారం ఉదయం బాధిత రైతులు కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో వైర్ల చోరీ, విద్యుత్ మోటర్ల దొంగతం వంటి సంఘటనలు జరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరారు.

## అర్చకుడు వలివేటి సురేందర్ శర్మ కన్నుమూత

**టీ మీడియా,మార్చి29,సింగరేణి(కారేపల్లి):**



ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గేట్ కారేపల్లి గ్రామంలో గల శ్రీ ఉమాసమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ప్రముఖ అర్చకుడు వలివేటి సురేందర్ శర్మ ( 38) అనారోగ్యంతో శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనకు ఇంటి వద్దనే వైద్యసేవలు అందిస్తున్నప్పటికీ ఆరోగ్యం విషమించి మరణించినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. సురేందర్ శర్మ ఆలయంలో అనేక సంవత్సరాలుగా అర్చకుడిగా సేవలందిస్తూ భక్తుల ఆదరణను పొందారు. నిత్యపూజలు, ప్రత్యేక ఉత్సవాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆయన చురుకుగా పాల్గొనేవారు. ఆయన సేవల వల్ల ఆలయానికి మంచి పేరు తీసుకొచ్చారని స్థానికులు తెలిపారు. సాదాసీదా స్వభావం, వినయపూర్వక ప్రవర్తనతో భక్తుల హృదయాలలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ఆయన మరణవార్త తెలిసి కారేపల్లి మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భక్తులు, గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆలయ కార్యకలాపాల్లో ఆయన లేని లోటు ఎప్పటికీ తీరదని పలువురు భావోద్వేగంతో తెలిపారు. మరణించిన సురేందర్ శర్మకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. ఆయన అంత్యక్రియలు సోమవారం కారేపల్లి స్వగ్రామంలో నిర్వహించారు.

## జన్మదినం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

• వైద్య శిబిరాన్ని ప్రారంభించిన పలుస. రమేష్ గౌడ్

**టీ మీడియా, మార్చి 29, వనపర్తి బ్యూరో :**



వనపర్తి మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్ పలుస. శ్రీకర్ గౌడ్ 31వ జన్మదినం సందర్భంగా బి. ఆర్. ఎస్ శ్రేణులు, శ్రీకర్ గౌడ్ అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు పెద్ద ఎత్తున పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వార్డులోని పట్టణ ఇలవేలుపు జమ్ములమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైద్య శిబిరం పెద్ద ఎత్తున ఏర్పాటు చేసి వందలాది మందికి షుగర్, బి. పి, కంటి చూపుతో పాటు వివిధ వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. చికిత్స తీసుకున్న పలువురు మాట్లాడుతూ శ్రీకర్ గౌడ్ సేవాభావం కలిగిన యువ నాయకుడని కౌన్సిలర్ కాకముందు నుంచి కూడా పలుసేవా కార్యక్రమాలు నిర్వహించి పలువురి మన్ననలు పొందారని వారు భగవంతుణ్ణి ఆదేశాలతో నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాక్షించారు. అన్నప్రసాద వితరణ అనంతరం శ్రీకర్ ను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన ప్రముఖులు, అభిమానులు. అనంతరం అన్నప్రసాద వితరణ చేసి శ్రీకర్ గౌడ్ చేత బర్త్ డే కేక్ కట్ చేయించి ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమములో గట్టు యాదవ్, వాకిటి. శ్రీధర్, పలుస. రమేష్ గౌడ్, కాగితాల. లక్ష్మీనారాయణ, ఉంగ్లం. తిరుమల్ , మెకానిక్. శ్రీను, కొల్లాపూర్. రాము, జయరాములు, నందిమల్ల. రాములు తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వృద్ధురాలి మృతి

• పాడే మోసిన సింగరేణి సర్పంచ్ మేదరి.వీరప్రతాప్(టోనీ)

**టీ మీడియా,మార్చి29, సింగరేణి (కారేపల్లి):**



సింగరేణి గ్రామానికి చెందిన వృద్ధురాలు హంస వాలి ఠాగూర్(85) మృతిపై గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా సింగరేణి సర్పంచ్ మేదరి వీర ప్రతాప్ (టోనీ) ఆమె భౌతిక దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంత్యక్రియలలో స్వయంగా పాల్గొన్న సర్పంచ్ టోనీ, పాడె మోసి తన మానవతా భావాన్ని చాటుకున్నారు. గ్రామ పెద్దలు, ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో హాజరై ఆమెకు చివరి వీడ్కోలు పలికారు. హంసవాలి ఠాగూర్ ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామ ప్రజలు, ప్రార్థించారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## పరిహారం కోసం పోలవరం బాధితులు ఎదురుచూపులు

**టీ.మీడియా,మార్చి29,చింతూరు:**



చింతూరు యూనిట్ కు సంబంధించి పోలవరం నిర్వాసితులకు ఇళ్ల నష్టపరిహారం చెల్లింపుల విషయంలో సుమారు 120 కుటుంబాల కు నష్టపరిహారం చెల్లింపు విషయంలో చోటు చేసుకుంటున్న జాప్యంపై నిర్వాసితులకు న్యాయం జరగడం లేదని బిజెపి నాయకులు డివిఎస్ రమణారెడ్డి కలెక్టర్ దినేష్ కుమార్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు ఆదివారం చింతూరు వచ్చిన పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ను కలిసి రమణారెడ్డి పరిహారం చెల్లింపుల విషయంలో పోలవరం బాధితులకు న్యాయం జరగాలని కోరారుఅదేవిధంగా చింతూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డాక్టర్ కొరత ఉన్నదని సరైన స్పెషలిస్టులు లేరని నాలుగు మండలాల్లో ఉన్న రోగులు చాలా ఇబ్బంది పడుతున్నారని తక్షణమే టీబి. కుష్టు. సంబంధిత స్పెషలిస్టులను తక్షణమే ఏర్పాటు చేయాలని వారు వివరించారు.

## సీనియర్ కార్యకర్తలకు చంద్రబాబు ఆత్మీయ విందు

• వస్త్రాలు, శాలువాతో సత్కారం

**టీ మీడియా, మార్చి 28, ఉండవల్లి :**



ఉండవల్లిలోని నివాసంలో పార్టీ సీనియర్ కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్? ఆత్మీయ విందు ఇచ్చారు. పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలకు ఆత్మీయ విందు ఏర్పాటు చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందించిన కార్యకర్తలను విందుకు ఆహ్వానించారు. విందుకు హాజరైన కార్యకర్తల ఆరోగ్య, కుటుంబ పరిస్థితులను సీఎం చంద్రబాబు, లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల పోరాటాలు, త్యాగాలు మర్చిపోలేమని స్పష్టంచేశారు. కుటుంబ సభ్యులుగా భావించి ఇంటికి ఆహ్వానించి విందు ఇవ్వడం జీవితంలో మర్చిపోలేమని కార్యకర్తలు తెలిపారు. అనంతరం కార్యకర్తలకు బట్టలు పెట్టి శాలువాతో చంద్రబాబు, లోకేశ్?లు సత్కరించారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్?లో తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ అధినేత చంద్రబాబు టీడీపీ జెండా ఎగురవేశారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్, ఇతర నేతలతో కలిసి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళు లర్పించారు. ఆ తర్వాత భారీగా తరలివచ్చిన తెలుగుదేశం శ్రేణులకు అభివాదం చేశారు. అందర్నీ ఆప్యాయంగా పలకరించారు. తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు ప్రసంగించారు. డి–లిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కీలక కామెంట్లు చేశారు. కార్యకర్తలను పట్టించుకోని నేతలు తనకు అక్కర్లేదంటూ స్పష్టం చేశారు. పార్టీ బలోపేతం కోసం పని చేస్తానంటూ కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఎవరు బాగా పని చేస్తే వారే ప్రజాప్రతినిధులు, ఈ సారి 50 శాతం సీట్లు పెరుగుతాయని చంద్రబాబు తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వస్తున్నాయని చెప్పారు. క్రమశిక్షణతో పని చేస్తూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

**టీడీపీ బ్రాండ్ నిలిపేలా వ్యవహరించాలి**

కార్యకర్తలను గుర్తించే పని లోకేశ్?దే అని చంద్రబాబు చెప్పారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఆదర్శంగా ఉండాలని వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రతి అంశంలో టీడీపీ బ్రాండ్ నిలిపేలా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదని తెలుగుదేశం పార్టీ బలంగా ఉంటేనే రాష్ట్రం బలంగా ఉంటుందని స్పష్టం చేశారు. పార్టీ గెలుపే రాష్ట్రం గెలుపు అని, పసుపు జెండా నిరంతరం ఎగురుతూ రాష్ట్రం ఎప్పుడూ గెలవాలన్నారు. తెలుగుదేశం పుట్టుక నుంచి నేటి వరకు మన సిద్ధాంతాలు, విజయాలు, ప్రయాణం అన్నీ సంచలనమే అని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు.

**కార్యకర్తల పిల్లల చేతుల్లో కత్తులు :**

జెండా మోసే కార్యకర్తలే పార్టీకి అధినేతలని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఎన్నో కష్టాలను ఓర్చి పార్టీని నిలబెట్టిన ఘనత కార్యకర్తలదేనని తేల్చిచెప్పారు. తెలుగుదేశం పార్టీ లేకుండా చేస్తానన్న వాళ్లు అడ్రస్ లేకుండా పోయారని ఎద్దేవా చేశారు. కొన్ని పార్టీలు వాళ్ల స్వార్థం కోసం చనిపోయిన కార్యకర్తల పిల్లల చేతుల్లో కత్తులు పెడతాయన్న లోకేశ్, చంద్రబాబు మాత్రం వారి చేతులకు పుస్తకాలిచ్చారని తెలిపారు. కార్యకర్తల పిల్లలను చదివించి వారికి ఉన్నత ఉద్యోగాలు వచ్చేలా చేశారన్నారు. కష్టపడిన కార్యకర్తలను గ్రామ స్థాయి నుంచి పొలిట్ బ్యూరో స్థాయికి తీసుకెళ్లటం తన బాధ్యత అని హామీ ఇచ్చారు. గతంలో అధికారంలో ఉన్న వారు అహంకారంతో విర్రవీగడంతోనే 151 సీట్ల నుంచి 11 స్థానాలకు పడిపోయారన్నారు. అందుకే ప్రజలతో నిత్యం మమేకం కావాలని సూచించారు.

## అదుపుతప్పి ఆటో బోల్తా

• 6గురు చిన్నారులకు గాయాలు

**టీ మీడియా,మార్చి29,సింగరేణి(కారేపల్లి):**



ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో దానిలో ఉన్న 6గురు చిన్నారులకు గాయాలైన ఘటన కారేపల్లి మండలం జమాళ్లపల్లి సమీపంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెల్పిన వివరాలు ఇలా ఉన్నాయి. పేరుపల్లికి చెందిన వజ్జా సునిల్ తన ఆటోలో 6గురు చిన్నారులకు సరదాగా ఎక్కించుకోని జమాళ్లపల్లి వైపు తీసుకవెళ్తుండగా అటో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో దానిలో ప్రయాణిస్తున్న పులసం యశ్వంత్, అలెం స్నేహిత్, దనసరి భారత్, అలెం తేజ, అలెం చిట్టు, దనసారి ప్రవీణ్ లకు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు గాయాలైన చిన్నారులను కారేపల్లి పీహెచ్‌సీకి తరలించి అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చిన్నారులలో ఇద్దరికి తీవ్రంగా గాయాలైనాయి.

## తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

**టి మీడియా,మార్చి 29,ఎండపల్లి:**



తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించి 44 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో పార్టీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజరాజేశ్వర కిరాణం వద్ద ఎండపల్లి మండల పార్టీ అధ్యక్షులు రాయచ్చు సదాశివ గుప్త ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం నందమూరి తారకరామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకుని పేదలకు మజ్జిగ ప్యాకెట్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు సదాశివ గుప్త మాట్లాడుతూ.. "కూడు, గూడు, గుడ్డ" అనే నినాదంతో తెలుగువారి ఆత్మగౌరవం కోసం ఎన్టీఆర్ పార్టీని స్థాపించారని కొనియాడారు. పార్టీ పెట్టిన 9 నెలల్లోనే అధికారంలోకి వచ్చి, పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన మహనీయుడు ఎన్టీఆర్ అని గుర్తుచేశారు. పరిపాలనను వికేంద్రీకరిస్తూ మండల వ్యవస్థను ప్రవేశపెట్టి, అన్ని వర్గాల ప్రజల్లో రాజకీయ చైతన్యం నింపిన ఘనత ఆయనదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్యవైశ్య పేద ప్రజల సంఘం అధ్యక్షులు సముద్రాల రమేష్ గుప్తా, లడ్డు, రవి కిరణ్ గుప్త, పార్టీ అభిమానులు మడప సత్యనారాయణ, తిరుపతి, పోచయ్య, రాజయ్య, లచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

## బైకును ఢీకొన్న కారు

**టీ మీడియా ,మార్చి 29,పెబ్బేరు :**



పెబ్బేరు మున్సిపాలిటీకి చెందిన బత్తుల కృష్ణ వారి భార్య వరలక్ష్మి ఇద్దరూ బైక్ నెంబర్ టి ఎస్ 06 ఈ సి 8724 పెబ్బేరు నుంచి కల్వరాల గ్రామానికి పుట్టచిర ఫంక్షన్ కు వెళుతుండగా కిష్టారెడ్డిపేట ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ ముందర స్విఫ్ట్ డిజైర్ కారు నంబర్ టి ఎస్ 06 ఎఫ్ సి 1728 అతివేగంతో బైకును ఢీకొట్టడం వల్ల వాహనదారునికి తలకు కాలుకు బలమైన గాయాలు కావడంతో అంబులెన్స్ సహాయంతో వనపర్తికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు డాక్టర్ల సూచన మేరకు కర్నూల్ హాస్పిటల్ కు తరలించి ప్రస్తుతం అమీలియా హాస్పిటల్ లో చికిత్స అందిస్తున్నట్లు వారి కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## తిరుమల హోటళ్లపై యుద్ధ ప్రభావం

• అన్నప్రసాద కేంద్రాలకు పెరిగిన భక్తుల తాకిడి

**టీ మీడియా, మార్చి 28,తిరుమల:**




క్షేత్రం! నిత్యం లక్షల్లో వచ్చే భక్తజనం! వారిని ఆకట్టుకునేలా కొండపైనే ప్రైవేట్ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు. నిత్యం కళకళలాడే ప్రైవేట్ హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు యుద్ధం కారణంగా ఇప్పుడు విలవిలలాడుతున్నాయి. సగానికిపైగా మూతపడ్డాయి. అయినా శ్రీవారి భక్తులు మాత్రం ఆహారానికి ఇబ్బందిపడటం లేదు. టీటీడీ అన్నప్రసాద కేంద్రాలు వారి ఆకలి తీర్చుతున్నాయి. ఎంతమంది భక్తులు వచ్చినా అన్నప్రసాద వితరణకు ఆటంకం లేకుండా టీటీడీ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. పశ్చిమాసియా యుద్ధం కారణంగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా తగ్గింది. ఈ నెల 5 నుంచి ఏజెన్సీలు తిరుమలకు గ్యాస్ సరఫరాను 50 శాతానికిపైగా తగ్గించాయి. రోజూ 400 నుంచి 500 వాణిజ్య సిలిండర్లు తిరుమలకు సరఫరా అవుతుంటే యుద్ధం ప్రభావం వల్ల ఆ సంఖ్య 200 నుంచి 250కు పడిపోయింది. గ్యాస్ కొరతతో తిరుమలలోని 150 ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఇప్పటికే 40కి పైగా మూతపడ్డాయి. తెరిచి ఉన్న మిగిలిన హోటళ్లు ఉదయం, సాయంత్రం అల్పాహారాలు మాత్రమే అందుబాటులో ఉంచారు. మరికొన్ని హోటళ్లలో గ్యాస్ ఆదాలో భాగంగా మెనూలో మార్పులు చేశారు. గ్యాస్ ఎక్కువ అవసరమయ్యే పదార్థాలను మెనూ నుంచి తీసేశారు.

**ఉచిత అన్నప్రసాద కేంద్రాల వైపు భక్తులు**

ప్రైవేట్ హోటళ్లలో కోరుకొన్న ఆహారపదార్థాలు అందుబాటులో లేకపోవడంతో భక్తుల టీటీడీ ఉచిత అన్నప్రసాద కేంద్రాల వైపు వెళుతున్నారు. తరిగొండ వెంగమాంబ కేంద్రంలో రద్దీ అనూహ్యంగా పెరిగింది. గత ఏడాది మార్చి 16 నుంచి 25వ తేదీ మధ్య పది రోజుల్లో 5 లక్షల 95 వేల మంది మధ్యాహ్నం, రాత్రి భోజనం చేశారు. ఈ ఏడాది సరిగ్గా ఇదే పది రోజుల్లో ఆ సంఖ్య ఏకంగా 7 లక్షల 41 వేల 340కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఒక్క మధ్యాహ్నం, రాత్రి భోజనం స్వీకరించిన భక్తుల సంఖ్యే ఏకంగా లక్షా 46 వేలకు పైగా పెరిగింది. ఇక అల్పాహారం తీసుకున్న వారి సంఖ్య కూడా లక్షా 32 వేలు దాటింది. అన్నప్రసాద వితరణకు ఎలాంటి ఢోకా లేదు : ఒకవైపు గ్యాస్ కొరత మరోవైపు భక్తుల రద్దీ పెరుగుతుండటంతో టీటీడీ అప్రమత్తమైంది. ఎల్పీజీ నిల్వలను ఎప్పటికప్పుడు టీటీడీ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, వకుళమాత, శ్రీఅక్షయ కేంద్రాల్లో ప్రసాదాల తయారీకి ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. టీటీడీకి నిరంతరాయంగా ఎల్పీజీ సరఫరా చేయాలని ×ఉజాకు విజ్ఞప్తి చేయగా వారు సానుకూలంగా స్పందించారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరా యథావిధిగా కొనసాగుతుండటంతో ఎంత మంది భక్తులు వచ్చినా అన్నప్రసాద వితరణకు ఎలాంటి ఢోకా లేదని టీటీడీ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## హిందూ వాహిని నూతన గ్రామ కమిటీ



**టీ మీడియా, మార్చి 29, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా, శ్రీరంగాపురం మండలం తాటిపాముల గ్రామంలో హిందూ వాహిని నూతన గ్రామ కమిటీని ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హిందూ వాహిని వనపర్తి జిల్లా అధ్యక్షుడు శ్రీ అరుణ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కమిటీని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఛత్రపతి శివాజీ మహారాజ్, మహారాణ ప్రతాప్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ వంటి మహనీయుల స్ఫూర్తితో కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో ధార్మిక, సామాజిక కార్యక్రమాలను బలోపేతం చేయడం హిందూ వాహిని ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిపాముల గ్రామ హిందూ వాహిని అధ్యక్షుడిగా శ్రీ నరేష్ ను నియమించారు. అదేవిధంగా గ్రామ స్థాయి పూర్తి కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేశారు. అధ్యక్షుడు: నరేష్, వైస్ ప్రెసిడెంట్లు అఖిల్, బాలరాజ్, గోపి నరేష్ ప్రధాన కార్యదర్శి రాజు, గౌరవ సలహాదారులు భాస్కర్, వీ. శివ

కోర్ టీమ్, శివ, వరదగిరి మహేష్, సభ్యులు రమేష్, ఎల్. నరేష్, ఆర్. అశోక్, శివ శంకర్, సోషల్ మీడియా లోకేష్, సభ్యులుగా నందు, సాయి తదితరులను ఎన్నుకున్నారు.

# తెలుగుజాతి ఆత్మగౌరవ నినాదంతో పుట్టిన టీడీపీ

కార్యకర్తలను గుర్తించే పని లోకేశ్?దే అని చెప్పారు. తెలుగుదేశం కార్యకర్తలు, నాయకులు ఆదర్శంగా ఉండాలని వ్యక్తిగత ప్రవర్తన నుంచి ప్రతి అంశంలో టీడీపీ బ్రాండ్ నిలిపేలా వ్యవహరించాలని సూచించారు. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదని పార్టీ గెలుపే రాష్ట్రం గెలుపు అని పసుపు జెండా నిరంతరం ఎగురుతూ రాష్ట్రం ఎప్పుడూ గెలవాలని అన్నారు. తెలుగుదేశం పుట్టుక నుంచి నేటి వరకు పార్టీ సిద్ధాంతాలు, విజయాలు, ప్రయాణం అన్నీ సంచలనమే అని గుర్తుచేశారు. ప్రసంగం చివర్లో జై తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు జై కొట్టారు. పార్టీ బలోపేతం కోసం పని చేస్తానంటూ కార్యకర్తలతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. ఎవరు బాగా పని చేస్తే వారే ప్రజాప్రతినిధులు అవుతారని చెప్పారు. ఎన్నో రాష్ట్రాలకు రోల్ మోడల్: ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమానికి నాంది పలికింది తెలుగుదేశం అని అభివృద్ధికి అడుగులు వేసిందని సీఎం చంద్రబాబు చెప్పారు. 40 ఏళ్ల క్రితం టీడీపీ తెచ్చిన 2 రూపాయలకే కిలో బియ్యం జాతీయ ఆహార భద్రతా పథకమైందని గుర్తుచేశారు. అప్పుడు తెచ్చిన మహిళలకు ఆస్తి హక్కు తరువాత కేంద్రం చట్టం చేసిందని అన్నారు. మహిళలకు నాడు స్థానిక ఎన్నికల్లో కల్పించిన రిజర్వేషన్ దశాబ్దాల తరువాత 33 శాతం రిజర్వేషన్‌కు అడుగులు పడడానికి కారణం అయ్యిందని తెలిపారు. మన ప్రభుత్వం తెచ్చిన విద్యుత్ సంస్కరణలు ఆ తర్వాత ఎన్నో రాష్ట్రాలకు రోల్ మోడల్ అయ్యాయని వెల్లడించారు. మహిళా సాధికారతకు తెచ్చిన డ్వాక్రా సంఘాలు దేశంలోనే రోల్ మోడల్‌గా నిలిచాయని సీఎం చంద్రబాబు అన్నారు. బీసీలకు రాజ్యాధికారం కట్టబెట్టామని ఎస్సీలకు వర్గీకరణతో సమన్యాయం చేశామని తెలిపారు. ఎస్టీలకు భూములు, పథకాలు ఇచ్చి జీవితాలు మార్చామని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ విజయాలనే కాదు సంక్షోభాలను, సవాళ్లను చూసిందని చెప్పారు. ఎంతో మంది కార్యకర్తలు త్యాగాలు చేశారు, ప్రాణాలు పోగొట్టుకున్నారు, ఆస్తులు కోల్పోయారని నిద్రలేని రాత్రులు గడిపారని తెలిపారు. టీడీపీని ఫినిష్ చేస్తామని ఆలోచన చేసిన వారే ఫినిష్ అయ్యారని విమర్శించారు. ఇన్నేళ్ల ప్రస్థానం, నేటి ఈ అధికారం అంతా కార్యకర్తల త్యాగాలు, కష్టం వల్లనే వచ్చిందని చంద్రబాబు స్పష్టం చేశారు.

### కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన

ప్రతి ఒక్కరూ పార్టీ సిద్ధాంతాలకు, విధానాలను, క్రమ శిక్షణకు కట్టుబడి ఉండాలని చంద్రబాబు స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల వల్లనే మనం ఇక్కడ ఉన్నాం అని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నా కార్యకర్తలు కాలర్ ఎగరేసేలా పాలన అందిస్తున్నామని చెప్పారు. నాయకత్వం పెంపు కోసం నిరంతరం శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏకైక పార్టీ టీడీపీనే అని చెప్పారు. కార్యకర్తలకు రాజకీయ సాధికారత కల్పిస్తామని అన్ని పదవుల్లోనూ జనాభా దామాషా పద్ధతిన అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. కార్యకర్తలకు ఆర్థిక సాధికారత కల్పిస్తామని న్యాయ బద్ధమైన సంపాదన వచ్చేలా సహకరిస్తామని ప్రకటించారు. పోలవరాన్ని పూర్తి చేస్తామని అమరావతిలో మొదట ప్రారంభించిన పనులు 2028 ఆగస్టుకు పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా ప్రారంభిస్తామని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీగా అమరావతిని నిర్మిస్తున్నామని చెప్పారు. ఇక మూడు ముక్కలాట లేదని ఒకే రాష్ట్రం ఒకే రాజధాని అదే అమరావతి అని తేల్చిచెప్పారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధి రాజకీయాలు చేస్తోందని తెలిపారు. వైఎస్సార్సీపీ తప్పుడు ప్రచారాలను పార్టీ తిప్పికొట్టాలని నిత్యం ప్రజల్లో ఉంటూ చేస్తున్న మంచిని ప్రతి ఒక్కరికీ వివరించాలని నేతలకు దిశానిర్దేశం చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న 19 మంది కార్యకర్తలను చంద్రబాబు సత్కరించారు.

# కన్నవారికి అండగా ఉండేందుకు కొత్త చట్టం

### శాతం

ఈ బిల్లు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల సిబ్బంది, అలాగే ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు ఇందులోకి వస్తారు. తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనంలో నెలకు 15 శాతం లేదా గరిష్ఠంగా రూ.10,000 వరకు ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. ఇది నేరుగా అధికారుల ఆదేశాల మేరకు అమలు అవుతుంది. ఇది కేవలం శిక్షాత్మక చర్య కాకుండా బాధ్యతను గుర్తు చేసే ఒక సామాజిక చర్యగా ప్రభుత్వం భావిస్తోంది.

## మారుమూల ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిన -డా. రాఘవులు



టీ మీడియా,మార్చి29,సింగరేణి(కారేపల్లి): కామేపల్లి మండలం ఊట్కూరు గ్రామంలో డాక్టర్ సామినేని రాఘవులు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవులు కు పలువురు ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆయన సమాజానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన ప్రముఖులు, డాక్టర్ రాఘవులు గారు ఎప్పుడూ ప్రజలకు కారేపల్లి , ఊట్కూరు లోఅందుబాటులో ఉంటూ మారుమూల ప్రాంత ప్రజలకు వైద్యం అందించారని తెలిపారు. ముఖ్యంగా పేద విద్యార్థులను ప్రోత్సహించడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో ముందుకు సాగుతూ సమాజానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు గౌరవప్రదంగా నివాళులు అర్పించారు.

## వ్యక్తి ఆత్మహత్య



టీ మీడియా,మార్చి29,పాపన్నపేట: మనస్థాపంతో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని నార్సింగి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఫిరంగి సత్యనారాయణ (50) కల్లు వ్యాపారం చేస్తూ జీవితం సాగిస్తున్నాడు. కాగా వారం రోజుల క్రితం ఈయన పెద్ద కూతురు నిశ్చితార్థం జరిగింది. దీంతో త్వరలో వివాహం ఉండడంతో వివాహానికి నగదు లేక అప్పు కోసం ప్రయత్నం చేస్తున్నాడు. అప్పు ఎక్కడ దొరక్కపోవడంతో మనస్థాపం చెందిన అతను శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు చుట్టూ పక్కల వెతకగా ఆదివారం ఉదయం సమయంలో గ్రామ శివారులోని రోడ్డు పక్కనే పాడుబడిన రైస్ మిల్లులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొని కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించి మృతుడి భార్య స్వర్ణలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు

## ముత్యాలమ్మ గుడికి 'స్థల' దానం

### -60 గజాల స్థలాన్ని విరాళంగా ఇచ్చిన తుళ్లూరి దంపతులు



టీ మీడియా,మార్చి29, ఖమ్మం : ఖమ్మం నగరం ఒకటో డివిజన్ కైకొండాయిగూడెంలోని ముత్యాలమ్మ దేవాలయ విస్తరణకు అదే డివిజన్ లో నివాసం ఉంటున్న తుళ్లూరి మాధవరావు - కోటేశ్వరి దంపతులు విరాళం అందించారు. ఆలయ అభివృద్ధి కోసం తమవంతుగా సుమారు రూ. 6 లక్షలు విలువ చేసే 60 గజాల తమ స్థలాన్ని ఆలయానికి విరాళంగా ఇస్తున్నట్లు స్థల పత్రాలను ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందచేసి తమ ఉదారతను చాటుకున్నారు.

### తుళ్ళూరి దంపతులకు అభినందన

ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు నాగటి ఉపేందర్ మాట్లాడుతూ.. ఆలయ విస్తరణకు తమ వంతు సహాయంగా స్థలాన్ని దానం చేసిన మాధవరావు దంపతులను అభినందించారు. భక్తుల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా దాతలను గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దిని ప్రసాద్, ఆళ్ల రమేష్, గద్దల చిన్నప్ప, తుళ్లూరి కృష్ణయ్య, నాగటి శ్రీనివాసరావు, శీలం వీరబాబు, గిరిశాల రామారావు, పందుల తిరుపతిరావు, భూక్యా ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదికి ఘన సన్మానం



టీ మీడియా, మార్చి 29,పాల్వంచ: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కొత్తగూడెం జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా నియమితులైన కిరణ్ ముదళ్‌కర్ ని ఆదివారం పాల్వంచ అయ్యప్ప నగర్‌లోని ఆయన స్వగృహంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతల్లో విజయవంతంగా కొనసాగాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, న్యాయవాదుల సంక్షేమం, న్యాయ వ్యవస్థ అభివృద్ధికి మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాలోత్ ప్రశాంత్,నాగేంద్ర బాబు,మాదారపు లక్ష్మణ్,బల్లాడి దిలీప్, అజ్మీరా రాము, సాగంటి వెంకటేష్, సంకినేని రుద్ర, విక్కీ, కిట్టు, భట్టు అశోక్, శేఖర్, కొత్తపల్లి విజయ్, బానోత్ బాలాజీ, రాజా, సన్నీలు పాల్గొన్నారు.

# అసోం ప్రజలకు... కాంగ్రెస్ '5 హామీలు'

### బీజేపీ విచ్చలవిడి అవినీతి

అసోంలోని బీజేపీ ప్రభుత్వం విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతోందని ఖర్గే విమర్శించారు. ప్రజలను దోచుకొని, దిల్లీలోని తమ నాయకుల, వారి కుటుంబాల ఖజానాను నింపడానికి అసోం బీజేపీ తన డబుల్ ఇంజిన్?ను ఉపయోగిస్తోందని దుయ్యబట్టారు. అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ ఒక 'నకిలీ ముఖ్యమంత్రి'. ఎందుకంటే, 2021 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, గిరిజన నాయకుడు సర్బానంద సోనోవాల్?తో కలిసి పోటీ చేసింది. కానీ ఎన్నికల తర్వాత హిమంత బిశ్వ శర్మ ఆ గిరిజన నేతను తొలగించి అసోం ముఖ్యమంత్రి పీఠాన్ని చేజిక్కించుకున్నారు. శర్మ ప్రభుత్వం ప్రజలను భయపెడుతూ, భయానక వాతావరణాన్ని సృష్టిస్తోంది. రాష్ట్ర ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తోంది' అని ఖర్గే ఆరోపించారు. 'హిమంత బిశ్వ శర్మ ప్రజల్లో భయాన్ని రేకెత్తిస్తున్నారు. ఆయనతో లేని వారని ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. అటువంటి రాజకీయాలకు భయపడకండి' అని ఖర్గే అన్నారు.

### 100 రోజుల్లో న్యాయం!

'జుబీన్ గార్గ్ దారుణ హత్యకు గురయ్యారు. ఆయన కేసును 100 రోజుల్లో పరిష్కరిస్తాం. నేరస్థులను ఎట్టిపరిస్థితుల్లోనూ తప్పించుకోనివ్వం' అని మల్లికార్జున ఖర్గే ప్రకటించారు.

### ఆదివాసీలకు పట్టా భూములు

తమ ప్రభుత్వం వస్తే ప్రస్తుతం ఉన్న వార్షిక కేటాయింపుల విధానాన్ని తొలగించి, 10 లక్షల మంది ఆదివాసీలకు శాశ్వత భూపట్టాలు ఇస్తామని ఖర్గే ప్రకటించారు. దీని వల్ల ప్రజలు పరిపాలన యంత్రాంగం చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని, వారి భూహక్కులు శాశ్వతంగా భద్రంగా ఉంటాయని పేర్కొన్నారు. సామాజిక భద్రతను కల్పిస్తూ సీనియర్ సిటిజన్లకు నెలకు రూ.1,250 చొప్పున భత్యం ఇచ్చే అంశాన్ని తమ మ్యానిఫెస్టోలో చేర్చామని చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేసే తమ పార్టీకి మద్దతు ఇవ్వాలని ఆయన అసోం ఓటర్లను కోరారు.

### విజయం కోసం కాంగ్రెస్ తహతహ

తరుణ్ గొగోయ్ మరణం తర్వాత అసోం కాంగ్రెస్‌లో శూన్యత ఏర్పడింది. ఆ లోటును ఈ ఎన్నికల్లో గౌరవ్ గొగోయ్ భర్తీ చేస్తారని కాంగ్రెస్ భావిస్తోంది. ఇటీవల లోక్‌సభలో తన గళాన్ని బలంగా వినిపించిన గౌరవ్?, రాష్ట్రంలో మళ్లీ పార్టీకి ఊపిరి పోశారు. బీజేపీలో ఉన్న అసంతృప్త నేతలను చేర్చుకోవడం, గిరిజన వర్గాలకు ఎస్టీ హోదా హామీ ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును పెంచుకోవాలని చూస్తోంది. అయితే, కాంగ్రెస్ కీలక నేతలు ఇటీవల పార్టీ మారడం ప్రధాన ప్రతిబంధకంగా మారింది. ప్రస్తుత ప్రతికూలతల మధ్య రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న గౌరవ్ గొగోయ్ అసోంలో పెద్ద నాయకుడిగా ఎదుగుతుండడం కాంగ్రెస్‌కు ఉపశమనం కలిగించే అంశం. మరి ఆయన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్?కు విజయం చేకూర్చిపెడతారో, లేదో చూడాలి. కాగా, అసోం అసెంబ్లీ ఎన్నికలు 2026 ఏప్రిల్ 9న ఒకే దశలో జరగనున్నాయి. ఎన్నికల ఫలితాలు మే 4న ప్రకటిస్తారు.

# అమెరికా, ఐరోపా దేశాల్లో... 'నో కింగ్స్' నిరసనలు

### న్యూయార్క్ నగరంలోనూ ర్యాలీ

విపక్ష డెమొక్రటిక్ పార్టీ పాలిస్తున్న న్యూయార్క్ నగరంలోనూ ప్రజలు నో కింగ్స్ ర్యాలీని నిర్వహించారు. న్యూయార్క్ నగరంలో నో కింగ్స్ నిరసనల సందర్భంగా న్యూయార్క్ సివిల్ లిబర్టీస్ యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డోనా లైబర్‌మన్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. నిరసనకారులను భయభ్రాంతులకు గురి చేసేందుకు ట్రంప్ ప్రభుత్వం యత్నిస్తోందని ఆమె ఆరోపించారు. తమ నిరసనలను ఏ శక్తీ అడ్డుకోలేదని తేల్చి చెప్పారు.

### ఈ రాష్ట్రాల్లోనూ నిరసనలు

అమెరికాలోని ఇదాహో రాష్ట్రంలో ఉన్న తూర్పు ప్రాంతంలోనూ 2వేల మందికిపైగా ప్రజలు నిరసనకు దిగారు. దలాస్ ఏంజెల్స్‌లో నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. అనంతరం పలువురిని అరెస్టు చేశారు. కొలరాడో రాష్ట్రంలోని డెన్వర్ నగరంలో 9 మంది నిరసనకారులను పోలీసులు అరెస్టు చేశారు. విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేసేందుకు పలువురు యత్నించారని వారు ఆరోపించారు.

కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాండియాగో నగరంలో 40వేల మందికిపైగా ప్రజలు నిరసనల్లో పాల్గొన్నారు.

కాన్సస్ రాష్ట్రంలోని టోపెకా నగరంలోనూ నిరసనలు జరిగాయి. గాలితో నింపే కప్ప, ట్రంప్ బాలుడి వేషధారణల్లో ఇద్దరు నిరసనకారులు అలరించారు. వ్యోమింగ్, మోంటానా, ఉతా, సౌత్ డకోటా, లూసియానా, పెన్సిల్వేనియా, జార్జియా, అరిజోనాలలోనూ నిరసనలు జరిగాయి.

### నిరసనల్లో 90 లక్షల మంది?

నో కింగ్స్ ర్యాలీలలో అమెరికావ్యాప్తంగా దాదాపు 90 లక్షల మంది పాల్గొన్నారని నిర్వాహక వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే దీనిపై కచ్చితమైన సమాచారమేదీ లేదు. ఈసారి అమెరికాలోని మొత్తం 50 రాష్ట్రాల్లో ట్రంప్ పాలనా విధానాలకు వ్యతిరేకంగా 31,00 కార్యక్రమాలు జరిగాయని నిర్వాహకులు తెలిపారు. 2025 అక్టోబరులో అమెరికాలో నిర్వహించిన నిరసన కార్యక్రమాల కంటే ఈ సంఖ్య 500 ఎక్కువన్నారు.

### నిరసనకారులకు వామపక్ష నిధులు : వైట్ హౌస్

"నో కింగ్స్ నినాదంతో ర్యాలీలు చేస్తున్న వాళ్లందరికీ వామపక్ష నెట్‌వర్క్‌ల నుంచి ఫండింగ్ లభిస్తోంది. వాళ్లకు నిజమైన ప్రజా మద్దతు అనేది లేదు. కొంతమంది న్యూస్ రిపోర్టర్లకు డబ్బులిచ్చి మరీ ఈ కార్యక్రమాలను కవర్ చేయిస్తున్నారు" అని అమెరికా వైట్ హౌస్ అధికార ప్రతినిధి అబీగెయిల్ జాక్సన్ ఓ ప్రకటనలో ఆరోపించారు.

### ఇవి అమెరికాను ద్వేషించే వాళ్ల ర్యాలీలు

"అమెరికాను ద్వేషించే వాళ్లంతా నో కింగ్స్ ర్యాలీలలో పాల్గొంటున్నారు. వాళ్లంతా తీవ్రవామపక్ష వాదులు. ఆ నిరసనకారులు అత్యంత హింసాత్మక, వికృత కల్పనలతో మాట్లాడుతారు" అని నేషనల్ రిపబ్లికన్ కాంగ్రెషనల్ కమిటీ అధికార ప్రతినిధి మౌరీన్ ఓ టూలీ ఆరోపించారు.

### ట్రంప్‌ది యుద్ధోన్మాదం : ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్‌లోనూ నిరసనలు

ఇటలీ రాజధాని రోమ్‌లో వేలాది మంది నో కింగ్స్ ర్యాలీ నిర్వహించారు. నిరసనకారులు దేశ ప్రధానమంత్రి జార్జియా మెలోనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ న్యాయవ్యవస్థలో సంపూర్ణ సంస్కరణల కోసం ఇటీవలే మెలోని ప్రభుత్వం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను వారు తప్పుపట్టారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులను ఆపాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. బ్రిటన్ రాజధాని లండన్‌లోనూ పెద్దసంఖ్యలో ప్రజలతో నో కింగ్స్ ర్యాలీలు జరిగాయి. దేశంలో జాతి వివక్షను, అతివాద భావజాలాన్ని ఆపాలంటూ ప్రజలు నినదించారు. ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్ నగరంలోని బ్యాస్టిల్ కోట వద్ద వందలాది మంది నిరసన తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాదంతో యావత్ ప్రపంచాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని నిరసనకారులు ఆరోపించారు. ట్రంప్ బాధ్యతారహిత నిర్ణయాలకు యావత్ ప్రపంచం మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందన్నారు.

# 19 కుంభకోణాలపై... విచారణ జరిపించాలి

## సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ లేఖ





టీ మీడియా ,మార్చి 29 , హైదరాబాద్ బ్యూరో: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ శాసనసభాపక్షం లేఖ రాసింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతి కుంభకోణాలపై విచారణ జరపాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆ లేఖలో డిమాండ్ చేశారు. అవినీతి, కుంభకోణాలపై సభా సంఘం లేదా సిట్టింగ్ జడ్జితో పాటు మరో 19 అంశాలపై విచారణ చేయించాలని పేర్కొన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలంటే ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులతో సహా ఇతర ఎమ్మెల్యేలు పదవులకు రాజీనామా చేయాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం సభ్యులు డిమాండ్ చేశారు. అవినీతి, కుంభకోణాలపై లేఖ రాస్తే విచారణ జరుపుతామని శాసనసభలో స్వయంగా సీఎం ప్రకటించారని, కాంగ్రెస్ పాలనలో జరిగిన కుంభకోణాల వివరాలు అందిస్తున్నామని ఆ లేఖతో పేర్కొన్నారు. మాటపై ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ కుంభకోణాలపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి, ఇందులో ప్రమేయం ఉన్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాధనాన్ని రికవరీ చేయాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ విచారణ కోరుతున్న 19 అంశాలు

సివిల్ సప్లై స్కామ్,అమృత్ టెండర్ల స్కామ్,కేఎల్ఎస్ఆర్ స్కామ్,నైనీ కోల్ బ్లాక్ -- సింగరేణి స్కామ్,సింగరేణి ఓబీ స్కామ్?,సోలార్ పవర్ స్కామ్,ఎన్టీపీసీ థర్మల్ పవర్ స్కామ్,హెచ్‌సీయూ భూముల స్కామ్,లగచర్ల ల్యాండ్ స్కామ్,కోటి ఎకరాల భూమి నిషేధిత జాబితా స్కామ్,ఎక్సైజ్ మైక్రో బ్రూవరీ స్కామ్,హమ్ రోడ్స్ స్కామ్,టీడీఆర్ స్కామ్,యంగ్ ఇండియా స్కూల్స్ స్కామ్?,ఫోర్త్ సిటీ స్కామ్,హిల్ టీపీ స్కామ్?,అక్రమ మైనింగ్ స్కామ్?,డెక్కన్ సిమెంట్స్ స్కామ్?,మంచి రేవుల దేవాదాయ భూముల కుంభకోణం. సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి : అంతకుముందు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ వ్యవహారంపై సభా సంఘం వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అక్రమ మైనింగ్ చేస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చెయ్యాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్?లోని గన్ పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. ఆ పార్టీ నేతలు హరీశ్?రావు, కేటీఆర్ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. శాసనసభ సమావేశాలకు వెళ్తూ ప్లకార్డులు ప్రదర్శించి ఆందోళనకు దిగారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై ఆధారాలతో సహా బయట పెట్టామని, అవినీతి మంత్రిపై హౌస్ కమిటీ వెయ్యాలని, అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌పై ఎందుకు అలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. తప్పుచేయకపోతే భయమెందుకని నిలదీశారు. ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూసి, దిగి రాకపోతే గవర్నర్?ను కలిసి చర్యలు తీసుకోవాలని అడుగుతామని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి కుటుంబాన్ని ఎందుకు కాపాడాలని ప్రయత్నం చేస్తున్నారని ప్రశ్నించారు. మెట్రో భూముల అంశంపై ప్రభుత్వ చర్యలను కేటీఆర్ తప్పుబట్టారు. కాంగ్రెస్ అడ్డగోలు పాలనపై బీజేపీ మద్దతు ఇస్తున్నట్లు ఉందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తేల్చిచెప్పారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



టీ మీడియా, మార్చి 29,రాజన్న సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ... నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువకులకు స్వాగతం పలుకుతున్నాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం, ప్రజల సంక్షేమం కోరుతూ అమలు చేస్తున్న పథకాల గురించి క్షేత్రస్థాయిలో అందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలి. నూతనంగా పార్టీలో చేరిన కార్యకర్తలు ఎఐసిసి, పిసిసి, డిసిసి, పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇచ్చిన ఏ పిలుపు నైనా స్వీకరించి కార్యక్రమాల్లో పాల్గొనాలి. కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆకునూరి బాలరాజు, పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, స్థానిక నాయకులు బడుగు బారత్, నాగరాజు, రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ బస్సులో మంటలు




టీ మీడియా, మార్చి 29,హనుమకొండ: హనుమకొండ జిల్లా కేంద్రంలోని వరంగల్-2 డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సు డిపో లో ఛార్జింగ్ చేస్తుండగా కింది భాగంలో మంటలు చెలరే గాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే మంటలు ఆర్పి వేశారు. ఈ విషయంపై డిపో మేనేజర్ రవిని వివరణ కోరగా ఎలక్ట్రిక్ బస్సులో 12 బ్యాటరీలు ఉంటాయని, అందులో ఒక బ్యాటరీలో మంటలు వచ్చాయని తెలిపారు. డ్యూటీలో ఉన్న సిబ్బంది వెంటనే మంటలను చల్లార్చి అదుపులోకి తీసుకొ చ్చారని, ఎలాంటి నష్టమూ జరగలేదని తెలిపారు.

# బీజేపీ అధికారంలోకి వస్తే అనేక కష్టాలు



డాక్టర్ల రిపోర్టులను చూసుకోవాలని కేంద్ర హోంమంత్రికి మమత సూచించారు. 2021 ఎన్నికల్లో తాను వీల్‌ఛైర్‌పై ఎన్నికల ప్రచారం చేయాల్సి వచ్చిందని, అప్పట్లో బీజేపీ వాళ్లే ఉద్దేశపూర్వకంగా తన కాలికి గాయమయ్యేలా చేశారా అని ఆమె ప్రశ్నించారు. తన ప్రాణాలను తీసేందుకు బీజేపీ వాళ్లు కుట్ర పన్నుతున్నారా అని దీదీ అడిగారు.

### లక్ష్మీర్ భండార్ స్కీంను పక్కన పెడతారు

బంగాల్‌లో బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమి గెలిస్తే మహిళల కోసం తాము తీసుకొచ్చిన లక్ష్మీర్ భండార్ పథకాన్ని పక్కన పెడుతుందని మమత పేర్కొన్నారు. సరిగ్గా ఈ ఎన్నికలకు ముందు, ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్) ప్రక్రియ పేరుతో 1.2 కోట్ల మంది పేర్లను ఓటరు జాబితాల నుంచి బీజేపీ తొలగించిందని ఆమె ఆరోపించారు.

### చొరబాట్లను ఆపితే సరిపోదు- అక్రమ వలసదారులను పంపేయాలి : అమిత్‌షా

అసోంలోకి విదేశీయుల చొరబాటును ఆపితే సరిపోదని, రాష్ట్రంలోని వలసదారులను గుర్తించి స్వదేశాలకు పంపించాలని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. గత పదేళ్లుగా అసోంలోకి విదేశీయుల చొరబాట్లను ఆపేందుకు బీజేపీ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలను చేపట్టిందని ఆయన తెలిపారు. అసోంలోని సోనిత్‌పూర్ జిల్లా ధేకియాజులీ అసెంబ్లీ స్థానంలో జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా ప్రసంగించారు. విదేశీ చొరబాటుదారులను రక్షించేందుకే కొన్ని రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యతిరేకిస్తున్నారని ఆయన విమర్శించారు. అసోం రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ గౌరవ్ గొగోయ్ కూడా చొరబాటుదారులను కాపాడాలని అనుకుంటున్నారని పేర్కొన్నారు. ఈవిషయంలో వైఖరి ఏమిటో రాష్ట్ర ప్రజలకు స్పష్టం చేయాలని గౌరవ్ గొగోయ్‌ను కోరారు. కాంగ్రెస్ హయాంలో దేశ భద్రతను సీరియస్‌గా తీసుకోలేదని, మనదేశంలోని ప్రజలను చంపేలా పాకిస్థాన్ ఉగ్రవాదులను ప్రోత్సహించిందని అమిత్‌షా ఆరోపించారు. మళ్లీ హిమంత బిస్వ శర్మను సీఎంగా చేసేందుకు బీజేపీకే ఓటు వేయాలని రాష్ట్ర ప్రజలను కోరారు.

### అసోంలో బీజేపీకి హ్యాట్రిక్ ఖాయం : బీజేపీ చీఫ్

అసోంలో బీజేపీ హ్యాట్రిక్ కొడుతుందని, వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బీజేపీ చీఫ్ నితిన్ నబిన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆదివారం అసోంలోని తీన్ సుకియా జిల్లా మార్ఘెరిటీ పట్టణంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన ప్రసంగించారు. గతంలో అసోంను పాలించిన కాంగ్రెస్ పార్టీ ఓటుబ్యాంకు రాజకీయాలకు పాల్పడిందని నితిన్ నబిన్ మండిపడ్డారు. రాష్ట్రంలో మూడోసారి బీజేపీ గెలవడం, మళ్లీ హిమంత బిస్వ శర్మ సీఎం కావడం ఖాయమన్నారు. అసోంలో బీజేపీ అధికారంలోకి రాకముందు కేవలం హింస, నిరసనల గురించే చర్చ జరిగేదని ఆయన పేర్కొన్నారు. 2016లో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యావత్ దేశం అసోం గురించి మాట్లాడుకోవడం మొదలైందన్నారు.

